క్లుప్తంగా

నేడు పెద్దమక్కెనలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

సత్తెనపల్లి: మండల పరిధిలోని పెద్దమక్కెన గ్రామ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం సాయంత్రం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తంరావు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగల మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెడ్డిగూడెంలో నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెంలో నేడు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబు పాల్గొంటున్నట్లు తెలిపారు. కావున అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. అదే విధంగా మండలంలో 10వ తేదీన రాజుపాలెం, 14వ తేదీన చౌటపాపాయపాలెం, 15వ తేదీన అనుపాలెం, 16వ తేదీన అంచులవారిపాలెం, 17వ తేదీన కోటనెమలిపురి, 20వ తేదీన నెమలిపురి-1, 21వ తేదీన నెమలిపురి-2, 22వ తేదీన గణపవరం-1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

అమరావతి సచివాలయ నిర్మాణ పనులు పరిశీలన

అమరావతి: మండలకేంద్రమైన అమరావతి సచివాలయం-2 భవన నిర్మాణ పనులను బుధవారం పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ రూ.40 లక్షల నిధులతో నిర్మాణపనులు చేపట్టామన్నారు. సచివాలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయని కొద్ది రోజులలో ప్రారంభోత్సవం చేస్తామన్నారు. సచివాలయం వెనుక భాగంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు బాబురావు, మంగిశెట్టి కోటేశ్వరరావు, భవిరిశెట్టి హనుమంతరావు, షేక్ హష్మీ, అలా లక్ష్మీనారాయణ, నందూరు కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్లేరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

దొడ్లేరు(క్రోసూరు): పెదకూరపాడు నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయినటువంటి అమరావతి-బెల్లంకొండ రోడ్డు కల తీరనున్నదని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో డబుల్‌రోడ్డు పనుల్లో భాగంగా సీసీ రోడ్డు పనులు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత జూన్‌లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదగా అమరావతి-బెల్లంకొండ డబుల్‌లేన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని గుర్తు చేసారు. అప్పటి నుంచి రోడ్డు పనులు జెట్ స్పీడ్‌లో జరుగుతున్నాయన్నారు. దొడ్లేరు గ్రామంలో 33 అడుగుల వెడల్పుతో సిమెంట్ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. అనుకున్న దానికంటే ముందుగానే రోడ్డు పనులు పూర్తిచేస్తామని చెప్పారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు, సైడు డ్రైనులు వేస్తామన్నారు. దొడ్లేరు గ్రామంలో సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సత్తెనపల్లి మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీపై ప్రజావేదిక పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సత్తెనపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన 1,705 పనులకుగాను రూ.12,63,88,024 ఖర్చు చేశారు. వీటిపై 16వ విడత సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజావేదిక ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

శిఖర ప్రతిష్టా కుంభాబిషేక పూజలు ప్రారంభం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ ఫిరోజీ రుషీంద్రుల వారి మఠం వద్ద గల శ్రీ వేద గాయత్రీ దేవి అమ్మవారి దేవాలయంలో శిఖర ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవ పూజలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నారాయణ నగర సంకీర్తన వారిచే తోరణాలు కట్టి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి జోగెత్తుకొని ఎదురు నడిచారు. గురువారం శ్రీ వేద గాయత్రీ దేవి శిఖర ప్రతిష్ట అనంతరం సువాసినులకు అమ్మవారి ఒడిబాలు బియ్యం అందించనున్నారు. యాగ తీర్థ ప్రసాద వితరణ చేపడతారు. రాహు గ్రస్త, కుజదోషములు నివారించి సంపూర్ణ అనుగ్రహం కలిగించనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శిఖర ప్రతిష్టా కుంబాభిషేకం మహోత్సవంలో పాల్గొనాలని మఠాధిపతి పులహరి బాను ప్రసాద్ కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ముంగిటకే వైద్యం

- పేద ప్రజలకు వరంలా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- ప్రతి పౌరుడి ఆరోగ్య సంరక్షణే లక్ష్యం
- రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



వైద్య సేవలు అందించిన నర్సింగ్ విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా ప్రజల ముంగిటికే వైద్యం అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 15, 16 వార్డుల పరిధిలోని ప్రజలకు వడ్డవల్లి సచివాలయం ముందు బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రవేశ పెట్టిందన్నారు. ప్రతి పౌరుని ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. పేద వర్గాలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఒక వరమన్నారు. గతంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్పొరేట్ వైద్యశాలలు, కొంత మంది వ్యక్తులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ఇప్పుడు ప్రభుత్వమే నేరుగా నిర్వహిస్తూ.. ప్రతి పౌరునికి రోగ నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తుందన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని సమగ్ర వైద్యశాలలకు రిఫర్ చేస్తూ ఉన్నత ఆసుపత్రులల్లో వైద్యం అందిస్తున్నామన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత సమర్ధవంతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్నారన్నారు. దీనికి తోడుగా క్షేత్రస్థాయిలో అనేక వైద్య సంస్కరణలతో విప్లవాత్మకమైన సేవలందిస్తున్నామన్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలను సమూలంగా అభివృద్ధి చేశామని వివరించారు. నాటికి నేటికీ జరిగిన అభివృద్ధిని ప్రజలు ప్రత్యక్షంగా పరిశీలించి పోల్చుకోవచ్చన్నారు. వైద్యులు డాక్టర్ ఎం అనూష, డాక్టర్ జి.ధర్మసింగ్ శాస్త్రి, డాక్టర్ సుమిత్రా, డాక్టర్ అక్షయ, డాక్టర్ పి సుబ్బారావులు 651 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముగ్గురికి మలేరియా, ఆరుగురికి ఈసీజీ, 205 మందికి రక్త శాతం, 230 మందికి ఆర్‌బీఎస్ పరీక్షలను నిర్వహించారు. 11 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. 131 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 46 మందికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ గత నెల 12 నుంచి ఈ నెల 8 వరకు పట్టణంలోని 31 వార్డుల పరిధిలోని 15 సచివాలయాల ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించి 7,668 మందికి వైద్య సేవలు అందించామన్నారు.181 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేయడం జరిగిందన్నారు. 1,011 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 503 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 15 మందిని కాటరాక్ట్ వైద్య పరీక్షలకు రిఫర్ చేశామన్నారు. శిబిరంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, 15వ వార్డు కౌన్సిలర్ గంటా రమణమ్మ, 16వ వార్డు ఇన్‌చార్జ్ నందిగం ఆదాం, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు అచ్యుత శివప్రసాద్, తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, శిరిగిరి వెంకట్రావు, లోకా మాధవ, చిలకా రమణయ్య, ఆకుల హనుమంతురావు, సాయి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, పలు వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు ఉన్నారు.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ఈనెల 10 వ తేదీన పెదకూరపాడు నియోజకవర్గం అమరావతిలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం పిలుపునిచ్చారు. స్థానిక క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక సాధికార యాత్ర ఈ నెల 10వ తేదీన అమరావతిలో జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తమ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకే సామాజిక సాధికార యాత్ర అని చెప్పారు. ధరణికోట జేబీగార్డెన్స్ నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుందని చెప్పారు. సుమారు 3.5 కిలోమీటర్ల మేర ప్రజాప్రతినిధులు, సామాన్య ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతారని అన్నారు. సాయంత్రం 6 గంటలకు అమరావతి రథం సెంటర్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. బహిరంగ సభలో జగనన్న ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చేసిన మంచిని వివరించటం జరుగుతుందన్నారు. కావున బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, నారు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ షరీఫ్, విప్పల రాజశేఖరరెడ్డి, మేదర రోశయ్య, పెద్దబాబు, మండలంలోని గ్రామాల నుంచి పార్టీనాయకులు హాజరయ్యారు.



సమీక్ష సమావేశానికి హాజరైన మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దాం

బెల్లంకొండ: పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతిలో ఈ నెల 10న జరగనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో బస్సు యాత్రపై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేశారని తెలిపారు. కులాలు, మతాలకు అతీతంగా జరిగిన సామాజిక న్యాయాన్ని ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలను చేస్తున్నట్లు తెలిపారు. బస్సు యాత్ర ఈ నెల 10న అమరావతిలో జరుగుతున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామాల నుంచి అన్ని వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, చింతారెడ్డి సాయిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆచార్యులు నిత్య విద్యార్థులే



మాట్లాడుతున్న రావుల సూర్యనారాయణ



పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో శిక్షణలో ఆచార్యులు

సత్తెనపల్లి: బోధనా రంగంలో ఆచార్యులు నిత్య విద్యార్థులేనని శ్రీ సరస్వతి విద్యాపీఠం క్షేత్ర అధికారి రావుల సూర్యనారాయణ, ఏపీ అధికారి కోవెల శ్రీనివాసాచార్యులు అన్నారు. శ్రీ సరస్వతి విద్యాపీఠం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 16 పాఠశాలలకు సంబంధించిన ఆచార్యులకు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణవర్గ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధన రంగంలో ఎప్పటికప్పుడు మెళకువలు, కొత్త అంశాలను తెలుసుకొని బోధించాలన్నారు. ఆచార్యులకు వివిధ అంశాలలో మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ బాధ్యులు కొసనం జగదీష్, డాక్టర్ రాధాబాయి, డాక్టర్ జి.శ్రీధర్, జేపీఎస్ శాస్త్రి, అబ్బూరి సత్యనారాయణ, చలువాది చిన్న సత్యనారాయణ, యద్దనపూడి సుబ్బారావు, దేవరశెట్టి రవి కుమార్, గోపికృష్ణ, వివిధ పాఠశాలల ప్రధానాచార్యులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి

సత్తెనపల్లి: బడి బయట ఉన్న విద్యార్థులు, చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు మళ్లీ తిరిగి చదువుకునే మంచి అవకాశం ఓపెన్ స్కూల్ ద్వారా ఉందని రాష్ట్ర ఓపెన్ స్కూల్ సమన్వయకర్త అక్బర్ అలీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుపై ఆసక్తి ఉన్న అర్హత కలిగిన వారందరూ ఓపెన్ స్కూల్ ఉపయోగించుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ ప్రాధాన్యత వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త కేఎంఏ హుస్సేన్, కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.సాంబయ్య, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఓపెన్ స్కూల్ సమన్వయకర్త అక్బర్ అలీ, పక్కన కెఎంఏ హుస్సేన్

అక్రమంగా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసినా, విక్రయించినా.. తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి పట్టణ సీఐ పీ ప్రభాకర్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పీ రాంబాబుతో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలో బాణసంచా విక్రయాలకు సంబంధించి మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా విక్రయాలు చేపట్టడం, తయారు చేయడం వంటివి చేస్తే కఠినంగా శిక్షలు ఉంటాయన్నారు. అధికారుల అనుమతి ఉన్న వారికే బాణసంచా స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. జనావాసాలకు దూరంగా, బాణసంచా దుకాణానికి దుకాణానికి మధ్య నిర్దేశించిన దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా బాణసంచా అక్రమ వ్యాపారం చేసినా .. శివకాశి లాంటి ప్రాంతాల నుంచి దీపావళికి ముందుగానే భారీ ఎత్తున బాణసంచా తీసుకొచ్చి జాగ్రత్తలు లేకుండా నివాసాల మధ్య పెట్టినట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, ప్రమాదాలు జరగకుండా నివారించడానికి సహకరించిన వారవుతారన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ ప్రభాకర్, పక్కన ఎస్ఐ రాంబాబు

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

నకరికల్లు: దీపావళి పండుగ పురస్కరించుకొని బాణసంచా విక్రయించే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్ఐ ఏ బాలకృష్ణ బుధవారం సూచించారు. బాణసంచా విక్రయాలు చేసే ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా, పార్కింగ్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు తక్షణమే మంటలు ఆర్పేందుకు నీరు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. విక్రయాలకు అనుమతులు లేకున్నా, నిబంధనలు పాటించకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి

మాచవరం: మిరపలో రసం పీల్చు పురుగు నివారణకు తక్షణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో మిరప పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మిరపలో రసం పీల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. తామర పురుగు నివారణకు రైతులందరూ సామూహికంగా మిరప తోటల్లో నీలిరంగు, పసుపు రంగు, తెలుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకొని పురుగు ఉధృతిని గమనించాలన్నారు. ఎరపంటగా ప్రొద్దు తిరుగుడు మొక్కలను వేయాలని సూచించారు. సస్యరక్షణకు అజాడిరెక్టిన్ 10వేల పీపీఎంను లీటరు నీటికి 2 మి.లీ. సర్ఫ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. జీవశిలీంద్రాలైన బవేరియా బసియానా 5 గ్రాములు, వర్టిసిలియంలేకాని 5గ్రా. పంచగవ్య 30 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లనల్లి, తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వీఏఏలు నరసయ్య, కరుణకుమారి, రైతులు పాల్గొన్నారు.



గంగిరెడ్డిపాలెంలో మిరప పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ వై.మోహన్

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు జెడ్పీ స్కూల్ విద్యార్థులు



అచ్చంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ, రెజ్లింగ్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎ.సుధారాణి, పీడీ ఆలపాటి సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 7వ తేదీన కొమెరిపూడిలో జరిగిన అండర్ 17 బాలికల విభాగం, కబడ్డీ పోటీలలో పి.కవిత, అచ్చంపేట గురుకుల పాఠశాలలో జరిగిన అండర్ 19 రెజ్లింగ్ పోటీలలో షేక్ రబ్బాని ఎంపికైనట్లు పీడీ సుజాత తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఇరువురు విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌లో 102 మందికి వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం-2 పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ బుధవారం వైద్య సేవలు అందించారు. ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్ 102 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 33 మందికి బీపీ, 21 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి 15 రోజులకు మందులను అందించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి బరువు తక్కువగా ఉన్న వారికి ప్రత్యేకంగా పౌష్టికాహారం అందించాలని కార్యకర్తలకు తెలిపారు. నలుగురు బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిరీషాభాయి, ఏఎన్‌ఎం ధనలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ హుస్సేన్, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నీటి శుద్ధతపై అవగాహన



నీటి శుద్ధతపై దీపాల మాదిరిగా అలంకారం



వాటర్‌ప్లాంట్‌లో మంచినీటి శుద్ధతపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: స్వచ్ఛమైన మంచినీటిని సేవించడం వల్ల ఎలాంటి వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. నీటి దివాలిపై పట్టణంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి మెప్మా టీఎంసీ నాగేశ్వరి ఆధ్వర్యంలో సీఓలు, ఆర్పీలు, సంఘ సభ్యులు ప్రదర్శన చేపట్టి మంచినీటి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం లక్కరాజు గార్లపాడు రోడ్‌లోని ఫిల్టర్ బెడ్ వద్ద నీటి శుద్ధతపై కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ డీఈ మధుసూదన్‌రావులు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘం ద్వారా పట్టణ ప్రజలకు అందించే మంచినీటి విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో వివరించారు. ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే స్వచ్ఛమైన మంచినీటిని సేవించాలన్నారు. ఈ సందర్భంగా నీటి శుద్ధతపై తీసుకునే చర్యలను వివరించారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైలు పట్టాలను దాటడం చట్టరీత్యా నేరం

- రాజుపాలెంలో నుక్కడ్ నాటకాల ద్వారా అవగాహన కల్పించిన రైల్వే శాఖ
- వివరాలు వెల్లడించిన డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ



మండలంలో స్థానికులకు నుక్కడ్ నాటకాల ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి రాజుపాలెం గ్రామంలో రైలు పట్టాలు దాటడం వల్ల కలిగే ప్రమాదాలు, పలు రకాల అంశాలపై నుక్కడ్ నాటకాలు డివిజన్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ సేఫ్టీ ఆపరేటింగ్ అధికారులు నిర్వహించడం జరిగిందని డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. సత్తెనపల్లిలోని రాజుపాలెం, సిరిపురం గ్రామాలలో బుధవారం నుక్కడ్ నాటకాల ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మిర్యాలగూడ-నల్గొండ సెక్షన్ మధ్య ట్రాక్టర్ రైలు పట్టాలపై ఇరుక్కుపోయిందని దానిని తొలిగించేందుకు చాలా సమయం పట్టిందని ప్రయాణికులు అసౌకర్యానికి గురైనట్లు తెలిపారు. రైల్వే ట్రాక్‌పై రైలు వచ్చే సమయంలో రైలు గేటు వేసి ఉన్న పలు ప్రాంతాలలో పశువులను, పట్టాలు తప్పించడం, వాహనాలు దాటించడం చేస్తున్నారని దాని వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రైల్వే నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీవ్రతరంగా ఉంటాయన్నారు. ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా కోరారు. రైలు వచ్చి పట్టాలపై నుంచి వేళ్ళే 5,10 నిమిషాల వ్యవధి వరకు వేచి ఉండాలని రైలు వచ్చు సమయంలో పట్టాలు దాటే యత్నం చేయడం నేరం అని తెలియజేశారు. ఇటువంటి ఘటనలు జరుగకుండా గ్రామీణ ప్రాంతాల వారికి నుక్కడ్ నాటకాలను చేస్తూ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే మన తోటి ప్రయాణికులు అసౌకర్యానికి గురయిన, ప్రమాదం సంభవించిన వారి కుటుంబాలు రోడ్డు పాలు అవుతాయని అలా జరుగకుండా ఉండాలంటే రైల్వే నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాల్సిందిగా తెలిపారు. అనంతరం నుక్కడ్ నాటకాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీజర్ విజయ కీర్తి, కళాకారులు, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో బుధవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ యువకుడు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్ఐ రాజీవ్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని చింతలబావి ప్రాంతంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు వేసిన బోరులారీ తిరిగి వెళ్తున్న సమయంలో లారీపైన కూర్చున్న కూలీలు రోహిత్(20), బడియ మణికంఠన్‌లకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రోహిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కందగన్ జిల్లాలోని కలివేడ మృతుడు రోహిత్ స్వగ్రామం. తీవ్రంగా గాయపడిన బడియ మణికంఠన్‌ను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతున్నాడన్నారు. క్షతగాత్రుడు మణికంఠన్ తమిళనాడు రాష్ట్రానికి చెందినవాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజీవ్‌కుమార్ తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో గల సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని సూచించారు.

ముత్యాలమ్మ కొలువులు ప్రారంభం

గురజాల : పట్టణంలో వేంచేసియున్న గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు బుధవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించడం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు అమ్మవారి గ్రామోత్సవం అనంతరం బియ్యం కొలువు నిర్వహించారు. వేకువజాము నుంచి ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.